క్లుప్తంగా

108 సేవలపై ఆరా



108 వాహనాన్ని పరిశీలిస్తున్న డివిజన్ అధికారి జగన్

పాతపట్నం: స్థానిక సీహెచ్‌సీలో ఉన్న 108 వాహనాన్ని పలాస డివిజన్ అధికారి జి.జగన్ గురువారం తనిఖీ చేశారు. వాహనం పనితీరు, పరికరాలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఫోన్ వచ్చిన వెంటనే స్పందించాలన్నారు. మెడికల్ టెక్నీషియన్ కె.ఆఫీస్, పైలట్ డి.రాంబాబు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త హరికుమార్

ఎల్.ఎన్.పేట: పండ్ల తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించటం వలన అధిక దిగుబడులను సాధించవచ్చని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానశాఖ శాస్త్రవేత్త హరికుమార్ అన్నారు. మండలంలోని కొత్తబాలేరు గిరిజన గ్రామంలో గురువారం చైతన్య పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో గిరిజన రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీడి, మామిడి, సపోటా, అరటి వంటి పలు రకాల పండ్ల తోటల్లో ఎరువులు, సాగునీటి యాజమాన్య పద్ధతులు ఎంతో అవసరమన్నారు. తెగుళ్లు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఉద్యానవన అధికారి అయంతి కుమారి, వీహెచ్‌ఓ టి.విమల, హెచ్ఈఓ తిరుపతిరావు, ఐటీసీ ప్రవీణ్, వెలుగు సీసీ ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



విద్యా సామగ్రి అందజేస్తున్న ట్రస్టు అధ్యక్షుడు శ్రీనివాసరావు

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. పెన్నులు, అట్టలు, పెన్సిళ్లు, తదితర విద్యా సామగ్రిని సుభలయ ఆర్అండ్ఆర్ కాలనీ సర్పంచ్ లంక రోజారాణి, ఎంపీటీసీ సభ్యురాలు చింతాడ బుడ్డు ఆధ్వర్యంలో అందించారు. ట్రస్టు అధ్యక్షుడు సూర శ్రీనివాసరావుకు హెచ్ఎం టి.కేశవరావు అభినందనలు తెలిపారు.


మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సరుబుజ్జిలి: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మత్తు పదార్థాల వాడకం వలన కలిగే దుష్పరిణామాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత మంచి మార్గంలో పయనిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

హిరమండలం: మండల కేంద్రంలోని సుభలయ మెట్ట (తపోగిరి)పై ఉన్న వేంకటేశ్వర ఆలయంలో స్వామివారి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. శుక్రవారం నుంచి నిర్వహించనున్న డోలోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులను సుభలయ, న్యూబ్యారేజీ సెంటర్, హిరమండలంలో తిరువీధి చేపట్టారు.

పాతపట్నం ఇన్‌చార్జి ఈఓగా కిశోర్



బాధ్యతలు స్వీకరిస్తున్న కిశోర్

పాతపట్నం: స్థానిక మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి ఈఓగా ఎస్.కిశోర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జూనియర్ అసిస్టెంట్‌గా ఇక్కడే పని చేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఓ వరప్రసాద్ మెడికల్ లీవ్‌లో ఉన్నారని ఈఓపీఆర్డీ ఎల్.వెంకటరావు తెలిపారు.




స్వామివారి ఉయ్యాల మండపం

అద్భుత కళకు సజీవ సాక్ష్యం

వేణుగోపాలస్వామి ఆలయం

- కట్టిపడేసే శిల్ప కళ సొంతం
- నేటినుంచి డోలోత్సవం
- 9 రోజులపాటు ఘనంగా డోలో యాత్ర
- స్వామివారికి 7వ రోజు తిరువీధి నిర్వహణ



శిథిలావస్థలో ఆలయ పరిసరాలు



మెళియాపుట్టి వేణుగోపాల ఆలయం

మెళియాపుట్టి: దేశంలోనే ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో శ్రీకాకుళం జిల్లాలోని మెళియాపుట్టి వేణుగోపాల ఆలయం ఒకటి. 1840లో పర్లాకిమిడి (ఒడిశా) మహారాజు ప్రతాపరుద్రుడు తన భార్య విష్ణుప్రియ మహారాణి కోరిక మేరకు ఈ ఆలయాన్ని కట్టించారు. గర్భాలయంలో కంచుతో తయారుచేసిన విగ్రహాలను రాధాగోవిందుడు చెలికత్తె లలితాంబగా యాత్రికులు కొలుస్తారు. పర్లాకిమిడి నగరానికి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న మహేంద్రతనయ నదీ తీరాన మెళియాపుట్టిలో ఈ ఆలయాన్ని నిర్మించారు. మహారాణి తల్లిదండ్రులు పసుపుకుంకుమ నిమిత్తం ఇచ్చిన ఆభరణాలు, కొత్త మొత్తం నగదు వెచ్చించి ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. గర్భగుడిలో ప్రతిష్ఠించిన మూలవిరాట్ విగ్రహాలను బృందావనం నుంచి తెప్పించినట్లు చరిత్ర చెబుతోంది.

ఆలయ నిర్మాణం ఇలా..

అప్పట్లో బరంపురం పట్టణానికి సమీపంలోని మతర అనే గ్రామానికి చెందిన శిల్పులతో ఆలయంలోని శిల్పాలను చెక్కించారని, 15 ఏళ్ల పాటు ఆలయ నిర్మాణం కొనసాగిందని పెద్దలు చెబుతుంటారు. తుమ్మబంకతో రాళ్లను అమర్చారు. ఏనుగులతో తొక్కించి తయారుచేసిన మిశ్రమాన్ని వాడటం వలన కట్టడం మరింత శోభ సంతరించుకున్నట్లు చరిత్ర చెబుతుంది. పురాతనమైన ఈ ఆలయం నేడు సరైన ఆదరణ లేక వెలవెలబోతోంది. ఆలయంలో ఉన్న తలుపుల తయారీ కోసం మైసూరు నుంచి కలప తెచ్చి వందలాది మంది విశ్వబ్రాహ్మణులు ఆరేళ్లపాటు తలుపులను తయారుచేశారని ఈ ప్రాంత వాసులు చెబుతున్నారు.

ఏటా ఘనంగా..

ప్రతీ ఏడాది స్వామివారి డోలోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ నెల 14వ తేదీన జాతర ప్రారంభంకానుంది. ప్రతీ సంవత్సరం మార్చిలో డోలోత్సవాలు నిర్వహిస్తారు. ప్రారంభానికి ముందు రోజు రాత్రి రాజవంశీయులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు, మఘా కార్యక్రమం నిర్వహించి పురవీధుల్లో ఊరేగిస్తారు. తొమ్మిది రోజులపాటు జరిగే డోలో యాత్రలో అనేక పౌరాణిక జానపద, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి యాత్రికులు, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయంలో ఇటీవల, తెలుగు, ఒడియా చలన చిత్రాలను సైతం చిత్రీకరించారు.

నిర్వహణ ఇలా..

పర్లాకిమిడి రాజ వంశస్తులకు రెండో ఎస్టేట్‌గా ఉన్న మెళియాపుట్టిలో 50 గ్రామాల నుంచి వచ్చిన ఫలసాయాన్ని ఆలయంలోని 30 గదుల్లో నిల్వ చేసి.. అప్పట్లో 42 మంది అర్చకులు, 25 మంది పనివారికి జీతాలుగా చెల్లించేవారు. స్వామివారికి నిత్య దూప, దీప, నైవేద్యాలకు ఇక్కడినుంచే చెల్లింపులు జరిపేవారు. ఆలయ పరిసరాల్లో ఉన్న సంపంగి, జామ, మామిడి, పూల తోటల్లోని పూలు, పండ్లనే పూజల్లో వాడేవారు.

సొరంగ మార్గం గుండా రవాణా..

ఆలయం నుంచి పర్లాకిమిడి బృందావన్ ప్యాలెస్‌గా పిలువబడే రాజుల ఉద్యానవనానికి సొరంగ మార్గం ఉండేది. దీనిద్వారా ఫలసాయం, బంగారు నాణేలు రవాణా చేసేవారు. ఇప్పటికీ సొరంగ మార్గం ఆనవాళ్లు ఉన్నాయి.

ప్రస్తుతం శిథిలావస్థలో ఆలయం

ఆలయం చుట్టు పక్కల ఉన్న రాతి శిల్పాలు, గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. గతంలో పలు పూజా కార్యక్రమాలు, శుభకార్యాలు చేసేటప్పుడు ఆయా గదుల్లో సామాగ్రి నిల్వ చేసి ప్రజలు సేదతీరేవారు. ప్రస్తుతం గదులన్నీ పిచ్చిమొక్కలతో అధ్వానంగా తయారయ్యాయి. ఎండోమెంట్ అధికారులు ఆలయాన్ని ఇటీవల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అయినా ఎటువంటి అభివృద్ధి జరగలేదు. ప్రాచీన ఆలయం శిథిలం కాకముందే కాపాడాలని భక్తులు ఆందోళన చెందుతున్నారు.

50 ఏళ్లుగా ఒక్కరే అర్చకుడు..

ఆలయానికి 50 ఏళ్లుగా నిత్యం పూజలందిస్తూ సేవ చేస్తున్నానని ఆలయ అర్చకుడు గోపీనాథ్ రథో చెబుతున్నారు. వేణుపాలుని సేవలోనే తన కుటుంబ మొత్తం ఉందన్నారు. తన ఆరోగ్యం కొన్ని నెలలుగా క్షీణించిందన్నారు. ప్రస్తుతం తన కుమారుడు గోకులకృష్ణ రథో అర్చకునిగా వ్యవహరిస్తున్నారన్నారు.



ఆలయంలోని విగ్రహాలు



కట్టిపడేసే శిల్పకళ

పని ఒత్తిడి తగ్గించండి

సారవకోట: పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ ఎంపీడీఓ మోహన్‌కుమార్‌కు పంచాయతీ కార్యదర్శులు గురువారం వినతిపత్రం అందించారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు ఎస్.మురళి మాట్లాడుతూ తాము నిరంతరం చేస్తున్న పనులతోపాటు వివిధ రకాల యాప్‌లు, సర్వేల బాధ్యత అప్పగించడంతో సెలవు రోజు సైతం కుటుంబానికి కేటాయించ లేకపోతున్నామన్నారు. శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రతీ నిత్యం వివిధ రకాల టెలీకాన్ఫరెన్స్, జూమ్ మీటింగ్, వెబెక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో మీటింగ్‌లు పెట్టడంతో తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నామన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి పి.సింహాలచం, తదితరలుఁ పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పశువులకు గాలికుంటు టీకాలు

మెళియాపుట్టి: నాలుగు నెలల వయసు దాటిన ప్రతీ పశువుకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను వేస్తున్నట్లు పాతపట్నం సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకర్ తెలిపారు. గురువారం మండలంలోని చిన్నసున్నాపురంలో టీకా ప్రక్రియను పరిశీలించారు. గాలికుంటు వ్యాధి పాల ఉత్పత్తిని తగ్గించి పాడి రైతుకు నష్టాన్ని మిగుల్చుతుందన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు టీకా ప్రక్రియ జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా 15,200 పశువులకు టీకాలు వేస్తామన్నారు. పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



టీకా ప్రక్రియ పరిశీలిస్తున్న డాక్టర్ మంచు కరుణాకర్

శివారు ప్రాంతాల్లో పటిష్ట నిఘా

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో గంజాయి విక్రయాలు, ఆకతాయిలు ఆగడాలు పెరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గురువారం నరసన్నపేట శివారులో డ్రోన్ కెమెరాతో పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో యువకులు, ఇతరుల కదలికలపై పటిష్ట నిఘా పెట్టామన్నారు. డ్రోన్ కెమెరాతో షూట్ చేశామన్నారు. అనుమానితులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎప్పటికప్పుడు డ్రోన్లతో నిఘా ఉంటుందన్నారు. ఎస్ఐ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ కెమెరాను పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

కిడ్నీలను కాపాడుకోవాలి

పాతపట్నం: ప్రతి ఒక్కరూ కిడ్నీలను కాపాడుకోవాలని, మారుతున్న ఆహార అలవాట్లతో కిడ్నీలు పాడవుతున్నాయని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు అన్నారు. గురువారం పాఠశాలలో సైన్ ఉపాధ్యాయుడు ఎస్.తారకరామారావు ఆధ్వర్యంలో ప్రపంచ మూత్ర పిండాల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు కిడ్నీల పనితీరుపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం వైకుంఠరావు

స్టడీ చైర్ల పంపిణీ



స్టడీ చైర్లతో విద్యార్థులు

కొత్తూరు: స్థానిక ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు 125 మంది విద్యార్థులకు స్టడీ చైర్లను హెచ్‌ఎం ఎ.గోవిందరావు గురువారం అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి చైర్లు అవసరమని కోరిన వెంటనే 16 మంది దాతలు విరాళాల రూపంలో రూ.1.25 లక్షలు అందించారన్నారు. దాతలకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు. కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టేకు కలప వేలం రేపు

బూర్జ: ఈ నెల 15వ తేదీన మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో టేకు కలప వేలం వేయనున్నారు. ఈ మేరకు తహసీల్దార్ వై.వి.పద్మావతి గురువారం తెలియజేశారు. వేలం ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలం పాటలో పాల్గొనాలన్నారు.

19న హిరమండలంలో..

హిరమండలం: ఈ నెల 19వ తేదీన స్థానిక మేజర్ పంచాయతీలోని మార్కెట్ ఆశీలు వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ హరికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయంలో వేలం పాట ఉంటుందన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.1.30 లక్షలు ధరావత్తు చెల్లించాలని లేదా రూ.లక్ష సాల్‌వెన్సీ ధ్రువపత్రంతోపాటు రూ.30 వేల ధరావత్తు అయినా చెల్లించవచ్చన్నారు.

పరామర్శ..



వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

పొందూరు: శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని తానెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అప్పలరెడ్డి, సాయిని ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ గురువారం రాత్రి పరామర్శించారు. గ్రామంలోని ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన రోడ్డు విషయంలో టీడీపీ కార్యకర్తల దాడిలో గాయాలపాలైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పరామర్శించి ధైర్యం చెప్పారు. పోలీసులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. గుడ్ల మోహన్, రాజగోపాల్, తదితరులు ఉన్నారు.

మురుగుతో అవస్థలు



ఈ చిత్రం ఆమదాలవలస టౌణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం, రైల్వే క్వార్టర్స్, లక్ష్మీనగర్ వీధి వెనుక ఉన్న కాలువలో పేరుకు పోయిన మురుగునీరు. దుర్వాసనతో ఆ ప్రాంతవాసులు, విద్యుత్ కార్యాలయ సిబ్బంది అవస్థలు పడుతున్నారు. తక్షణమే మురుగు తొలగించాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. - ఆమదాలవలస

సాగునీటి కష్టాలు



సారవకోట మండలంలో రబీలో వరి సాగు చేస్తున్న రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. గతేడాది డిసెంబర్‌లో తుఫాన్ కారణంగా వర్షాలు కురవడంతో వరి సాగు విస్తీర్ణం పెంచారు. ప్రస్తుతం పొలాలకు కావాల్సిన నీరు లేకపోవడంతో సమీపంలో ఉన్న చెరువుల్లో ఇంజిన్లు పెట్టి పంట ఎండిపోకుండా కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలో అత్యధిక విస్తీర్ణంలో ఉన్న రంగసాగరంలో ప్రతీరోజు సుమారు 10 నుంచి 15 ఇంజిన్లు పెట్టి పొలాలకు సాగునీరు అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ చెరువులో కూడా నీరు అడుగట్టింది. - సారవకోట

కదలవు.. మెదలవు..



ఈ చిత్రం పాతపట్నంలోని ప్రధాన రహదారిపై తిష్ట వేసిన పశువులు. పగలు, రాత్రీ తేడా లేకుండా రహదారులపై తిష్ట వేసి, వాహనాల రాకపోకలకు అంతరాయం కల్పిస్తున్నాయి. పార్క్ చేసిన వాహనాల్లో ఉన్న ఆహార పదార్థాలు, కూరగాయలు తినేస్తున్నాయి. కోర్టు, శివశంకర్ కాలనీ, ఆల్ ఆంధ్ర రోడ్డు, మార్కెట్ యార్డ్, బ్రాహ్మణ వీధి కూడళ్లల్లో పశువులు తిష్ట వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. - పాతపట్నం

అరటి గెలల నీరాజనం



సారవకోట మండలంలోని వడ్డినవలసలో గల త్రినాథ స్వామి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని గురువారం ఆలయ ప్రాంగణంలో భక్తులు అరటి గెలలు వేలాడదీశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. - సారవకోట

సంక్షిప్తంగా..

89 మందికి కంటి పరీక్షలు



సైరిగాంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి రిషిక

జలుమూరు: మండలంలోని సైరిగాం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో గురువారం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 89 మందికి వైద్యాధికారి రిషిక కంటి పరీక్షలు నిర్వహించారు. 20 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఆరోగ్య విస్తరణ అధికారి సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫైలేరియా కిట్ల పంపిణీ..

ఫైలేరియా కిట్లతో మరింత ప్రయోజనం కలుగుతుందని జలుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న లక్ష్మి అన్నారు. ఫైలేరియా బాధితులకు కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

కొత్తూరు: మండల కేంద్రంలోని పాడైన బోరును గురువారం బాగుచేశారు. బోరు పాడవ్వడంతో తాగు నీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు తెలుసుకుని స్పందించారు. బోరును బాగుచేయించి ప్రజలకు తాగునీరు అందించారు.

వేలం పాట ఖరారు

పొందూరు: స్థానిక పంచాయతీకి సంబంధించి గురువారం నిర్వహించిన వేలం పాట రూ.11.89 లక్షలకు పాటదారులు దక్కించుకున్నట్లు ఈఓ మోహన్‌బాబు తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రేగిడి లక్ష్మి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించామన్నారు. మార్కెట్ ఆశీలు రూ.11.10 లక్షలు, ఆటోస్టాండ్‌కు రూ.23,500, కబేళాకు రూ.55,500 ఖారారైందన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.1.78 లక్షలు అదనంగా ఆదాయం చేకూరిందన్నారు. ఈఓపీఆర్డీ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

నేడు చక్రతీర్థ స్నానాలు

హిరమండలం: మేజర్ పంచాయతీ సుభలయ తపోగిరిపై ఉన్న వేంకటేశ్వరస్వామి చక్రతీర్థ స్నానాలు శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. డోలోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

బూర్జ: మండలంలోని ఓ.వి.పేటలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదో తరగతిలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ఈ నెల 17 నుంచి మే 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు రుసుం ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చెల్లించాలన్నారు.

ఇంటి పన్ను వసూలు చేయాలి

కొత్తూరు: ఇంటి పన్ను వసూలులో అలసత్వం వహిస్తే సహించేది లేదని టెక్కలి డివిజన్ డీఎల్‌పీఓ గోపీబాల అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇంటి పన్ను బకాయిలు ఎక్కువగా ఉన్నందున కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. ఈఓపీఆర్డీ వసంతకుమారి, ఏఓ రాంబాబు పాల్గొన్నారు.

సారా మహమ్మారిని నిర్మూలిద్దాం

మెళియాపుట్టి: సారా మహమ్మారికి దూరంగా ఉండాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు. గురువారం సారా తయారీ నిర్మూలనలో భాగంగా సవర జర్రిభద్ర, అప్పోజిపేట, పాత్రునిలోవ గ్రామాల్లో నవోదయ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. సారా విక్రయించి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. సారా తయారీలో ఈ గ్రామాలు ముందువసరులో ఉన్నాయన్నారు. ఎక్సైజ్ సీఐలు షేక్ మీరాసాహెబ్, ఎం.వి.గోపాలకృష్ణ, ఎల్.అనురాధదేవి, ఎస్ఐ రమేష్ బాబు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక

పొందూరు రూరల్: మండలంలోని 2023-24లో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు సంబంధించి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం డ్వామా పీడీ సుధాకర్ ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 29 పంచాయతీల్లో 1,125 పనులకు రూ.16.46 కోట్లు చెల్లించినట్లు అధికారులు చదివి వినిపించారు. వేతనాల రూపంలో రూ.13.31 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ రూపంలో రూ.3.15 కోట్లు అందించినట్లు తెలిపారు. ఏపీఓ శ్రీనివాసరావు, ఏపీడీ పి.రాధ, జిల్లా విజిలెన్స్ అధికారి ఎస్.స్వరూపారాణి, ఎంపీడీఓ మన్మథరావు, తహసీల్దార్ వెంకటేష్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.